క్లుప్తంగా

21న వాసవీ నిత్యాన్నదాన సత్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఐత రాములు

భువనగిరి రూరల్: మండలంలోని యాదాద్రి క్షేత్ర సమీపంలో ఉన్న సురేంద్రపురి వద్ద నిర్మించిన వాసవీ నిత్యాన్నదాన సత్రం భవనం, వృద్ధాశ్రమం ఈ నెల 21న ప్రారంభించనున్నట్లు వాసవీ నిత్యాన్నదాన సత్రం వృద్ధాశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐత రాములు, ప్రధాన కార్యదర్శి ఇరుకుల రామకృష్ణ తెలిపారు. అదే విధంగా వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఉంటుందని చెప్పారు. గురువారం వడాయిగూడెం గ్రామ శివారులోని ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి చీర విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు మంచాల ప్రభాకర్, ఉపేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

రామన్నపేట: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయ బావుల వద్దకు ఒంటరిగా వెళ్లే సమయంలో మెడ చుట్టూ చీరకొంగు లేదా చున్నీని చుట్టుకోవాలని తెలిపారు. ఊర్లకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు, నగదును బీరువా, కిచెన్‌లోని డబ్బాల్లో కాకుండా రహస్య స్థలంలో భద్రపరచుకోవాలని చెప్పారు. నగరాలు, పట్టణాల్లో సీసీ కెమెరాలు ఉండడంతో దొంగల దృష్టి పల్లెటూళ్లపై పడిందని తెలిపారు.

తూప్రాన్‌పేటలో చెక్‌పోస్టు ఏర్పాటు



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

చౌటుప్పల్: మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో హైదరాబాద్– విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఎస్‌ఎస్‌టీం ఆధ్వర్యంలో గురువారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నోటిఫికేషన్‌కు క్రితం అక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తీసేశారు. గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో తిరిగి చెక్‌పోస్టు ప్రారంభించారు.

బీజేపీలో చేరిక

వలిగొండ: మండలంలోని కాంచనపెల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బద్దం భాస్కర్ రెడ్డి బీజేపీలో చేరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆయనకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దళితులకు అధ్యక్ష పదవి కేటాయించాలి

రాజాపేట: బీఆర్‌ఎస్ పార్టీ రాజాపేట మండల అధ్యక్ష పదవిని దళితులకు కేటాయించాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు మోత్కుపల్లి ప్రవీన్‌కుమార్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటివరకు బీఆర్‌ఎస్ పార్టీ రాజాపేట మండల అధ్యక్ష పదవిని అగ్రకులాలకు మాత్రమే కేటాయించారని, ఇప్పటికైనా దళితులకు కేటాయించాలని తెలిపారు.

'ఏ' గ్రేడ్ ధాన్యంగా పరిగణించాలి

మోత్కూరు: ఐకేపీ, సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని 'ఏ' గ్రేడ్ ధాన్యంగా పరిగణించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైళ్ల యాదిరెడ్డి కోరారు. ఈమేరకు గురువారం మోత్కూరు మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

సెల్‌ఫోన్లు చోరీ

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో పలువురు ప్రయాణికుల సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. గురువారం ఉదయం బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సులు ఎక్కి, దిగే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఐదుగురు ప్రయాణికుల వద్ద సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తమ సెల్‌ఫోన్లు పోయినట్టు గుర్తించిన బాధితులు లబోదిబోమన్నారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- అటకెక్కిన సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, ఎరువుల తయారీ ప్రక్రియ
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

రామన్నపేట: పల్లెలను సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతిగ్రామంలో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చేందుకు సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. ఈ చెత్తను సేకరించేందుకు ప్రతి పంచాయతీకి ట్రాక్టర్ ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగించకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి.

ప్రజాధనం చెత్తపాలు

జిల్లాలో 421 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పల్లె ప్రగతిలో కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో రూ.2.50లక్షల ఉపాధి హామీ నిధులతో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. ఇందుకోసం జిల్లాలో రూ.10.52కోట్లు ఖర్చు చేశారు. ప్రతి గ్రామంలో జనావాసాలకు దూరంగా ప్రభుత్వ భూముల్లో డంపింగ్‌యార్డ్‌ల వద్ద ఈ షెడ్లను నిర్మించారు.



రామన్నపేట మండలం వెల్లంకిలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్

ఆచరణకు నోచుకోని ఆలోచన

తడిచెత్తను నిల్వచేసి సేంద్రియ ఎరువును తయారు చేసి ఉపయోగించాలనే ఆలోచన ఆచరణకు నోచుకోవడం లేదు. చెత్తను వేరుచేసి ఆరబెట్టి ఎరువుగా తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక సిబ్బందిని నియమించలేదు. ఉపాధిహామీ పథకంలో పనిదినాలను కేటాయించలేదు. మల్టీపర్పస్ విధానంతో గ్రామపంచాయతీ కార్మికులపై పని భారం పెరిగింది. దీంతో సెగ్రిగేషన్‌షెడ్ల నిర్వహణ, ఎరువును తయారీ ప్రక్రియ అటకెక్కింది. సెమిగ్రేషన్ షెడ్లు అలంకార ప్రాయంగా మారాయి. కొన్ని గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయనే విమర్శలు ఉన్నాయి. ట్రాక్టర్లలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డ్‌లలో పోసి తగులపెడుతున్నారు.

ఉపాధి హామీ పథకంలో చేర్చాలి



"గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్తను ఎరువుగా మార్చాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదు. పంచాయతీ కార్మికులపై ఆధారపడకుండా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేర్చాలి. అవసరమైన పనిదినాలను సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణకు కేటాయించాలి.

– జెల్లెల పెంటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

నాణ్యమైన భోజనం అందించాలి

మోత్కూరు: మోత్కూరు మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టళ్లను ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను సందర్శించాలన్నారు. అనంతరం ప్రశాంత్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థి మృతికి కారణమైన సాంఘిక సంక్షేమ గురుకుల రీజనల్ కోఆర్డినేటర్ రజనిని సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వినయ్, చందు, శివ, సంతోష్ పాల్గొన్నారు.



ప్రశాంత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి



వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ దీప్తికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆలేరురూరల్: కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకుడు కొల్లూరు రాజయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. గురువారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వ్యవసాయ మార్కెట్ అసిస్టెంట్ సెక్రటరీ దీప్తికి అందజేశారు. వారి వెంట జాలపాక కిష్టయ్య, తెద్దు ఆంజనేయులు, లక్ష్మి, చంద్రయ్య, వెంకటేష్, రవి, రాములు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ



వీరవెల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

భువనగిరి రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ ఆరోపించారు. గురువారం భువనగిరి మండలంలోని వీరవెల్లి, చందుపట్ల గ్రామాల్లో హమాలీ బిల్డింగ్ తదితర రంగాల కార్మికులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్మికుల శ్రేయస్సుకు పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, లక్ష్మయ్య, కిష్టయ్య, నర్సింహ, అంజయ్య, పరమేష్, జహంగీర్, చంద్రమౌళి, స్కైలాబ్, శ్రీమరి, దాసు, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించాలి

వలిగొండ : ప్రజా నాయకుడు సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి వెంకట్ రెడ్డి కోరారు. గురువారం వలిగొండ మండలంలోని మధిర చింతబావి వద్ద సీపీఎం నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిర్పంగి స్వామి, సత్తి రెడ్డి, అంజిరెడ్డి, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ప్రచారం

బీబీనగర్: భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ బీబీనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామంలో గురువారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గాడి శ్రీనివాస్, శ్రీరాములు, రంజిత్, కవిత, మల్లేశ్, ఎట్టమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరామర్శ

భువనగిరి క్రైం: ఇటీవల కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను బీజేవైఎం నాయకులు గురువారం హాస్టల్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, బూర్గు మణికంఠ గౌడ్, కత్తుల శంకర్, ముక్కెర్ల గణేష్ యాదవ్, రేగు అమరేందర్, మేకల పాండు, శేఖర్‌రెడ్డి, కసుకుంట్ల రమేష్, చైతన్య, వివాకర్‌రెడ్డి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

మిల్లుల యజమానులపై విచారణ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏశాల అశోక్

భువనగిరి: రైతులను వేదిస్తున్న మిల్లుల యజమానులపై, ధర తగ్గింపుపై విచారణ చేయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఏ గ్రేడ్ కింద కాకుండా ధర తగ్గింపు చేసి బీ గ్రేడ్ కింద మిల్లర్లు కొనుగోలు చేసి రైతులను వేదిస్తున్నారన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పార్టీ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహాయ కార్యదర్శి చింతల మల్లేష్, మండల కౌన్సిల్ సభ్యులు దాసరి లక్ష్మయ్య, కోట శంకర్, చిక్క నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రామన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కన్నెకంటి వెంకటేశ్వరాచారి కోరారు. గురువారం ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు రామన్నపేట మండల కేంద్రంతోపాటు వెల్లంకి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్ము యాదయ్య, సిందం లింగయ్య, కట్కూరి భిక్షపతి, కూనూరు సుధాకర్, ఏలూరి రవి, యాదాసు లక్ష్మన్, కొడారి వెంకటేష్, సుర్వి హరిబాబు, గుండాల అంజయ్య, గుంటోజు క్రిష్ణమాచారి, కడగంచి జంగ్య, కానుకుర్తి అంజయ్య, డోగిపర్తి భాస్కర్, చిన్నపాక స్వామి, కాలేరు హరికృష్ణ, గొరిగె భీరప్ప, వడ్డెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరులో..

మోత్కూరు: బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గురువారం మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం, వెంకటేశ్వర కాలనీ, పద్మశాలీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొణతం నాగార్జున్‌రెడ్డి, దొంతి నరసింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్‌రెడ్డి, గుజ్జ సోమనర్సయ్య, పట్టణ కమిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య, నాయకులు ముత్తినేని తిరుమలేష్, జినుకల దశరథ, మామిడాల యాకేష్, బత్తుల యాదగిరి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు ఎడ్ల రాము, ఉపాధ్యక్షులు జి.చంద్రమౌళి, నిలిగొండ మత్స్యగిరి, పోల్కం శివ, ప్రధాన కార్యదర్శి అన్నెపు సత్యనారాయణ, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మోత్కూరు: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పేదల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

వలిగొండ: పేదల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు పడమటి జగన్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం వలిగొండ మండలంలోని టేకుల సోమారంలో ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన ఎన్నికల నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ రెడ్డి, రాచకొండ కృష్ణ, మారోజు అనిల్, సంతోష్, మందడి రంజిత్ రెడ్డి, వెంకటేష్, వెంకట్ రెడ్డి, నవీన్ రెడ్డి, రామకృష్ణ, అంబరీష్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



అగ్నిమాపక పరికరాల ప్రదర్శన తిలకిస్తున్న అగ్నిమాపక శాఖ జిల్లా అదనపు అధికారి

చౌటుప్పల్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక జిల్లా అదనపు అధికారి అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో ఉన్న దివీస్ పరిశ్రమలో గురువారం అగ్నిమాపక పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టే నివారణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అప్రమత్తత, అవగాహన లేకుంటే ఆస్తి నష్టమే కాకుండా ప్రాణనష్టం కూడా జరుగుతుందన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన అత్యాధునికమైన యంత్రాలను అందుబాటులో ఉంచిన దివీస్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పరిశ్రమ ఈహెచ్‌ఎస్ విభాగం జనరల్ మేనేజర్ బాలకిషోర్, ఏజీఎం సాంబశివరావు, సీనియర్ ఆఫీసర్ రంగారావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు డిపాజిట్ కూడా రాదు'

చౌటుప్పల్: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా రాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు జయప్రకాష్ ఆరోపించారు. గురువారం భువనగిరి పట్టణ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తరపున వివిధ రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఎంపీగా భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేశామన్నారు. సమావేశంలో నాయకులు ముప్పిడి సైదులుగౌడ్, ఉండాటి సత్యనారాయణ, నర్సింహ తదితరులున్నారు.

చక్రతీర్థంతో ముగిసిన శ్రీరామనవమి వేడుకలు



చౌటుప్పల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో చక్రతీర్థం నిర్వహిస్తున్న ప్రతినిధులు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకలు గురువారం చక్రతీర్థంతో ముగిసాయి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ఆలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, ధర్మకర్తలు కాంశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశం, పోలోజు శ్రీలతశ్రీనివాస్‌చారి, తూర్పాటి నర్సింహ, ప్రతినిధులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, కాసుల వెంకటేశం, కాసోజు మధు, అర్చకులు పెద్ది సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా రథోత్సవం

బీబీనగర్: శ్రీరామనవమి సందర్భంగా బీబీనగర్ మండలంలోని భట్టుగూడెం గ్రామంలో ఉన్న శ్రీరామాలయంలో గురువారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురుషోత్తమరెడ్డి, చైర్మన్ పల్లా రాంరెడ్డి, ఎంపీటీసీ బాలచందర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాములు, బస్వయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో రాయిగిరి–మోత్కూరు ప్రధాన రోడ్డుపై గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై గంజాయి తరలిస్తున్న మోత్కూరుకు చెందిన జిట్ట కిరణ్, వల్లందాసు వంశీ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 10 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. నాగరాజు తెలిపారు.

విరాళం అందజేత

గుండాల: మండలంలోని వెల్మజాల గ్రామంలో నూతనంగా చేపట్టిన శివాలయం పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన జోలం గణేష్ దంపతులు రూ.10వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ప్రశాంత్ భువనగిరిలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో మృతిచెందాడని, అతని మృతికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌ను రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కుటుంబానికి పక్కా ఇల్లు, రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బుగ్గ దేవేందర్, ఉపాధ్యక్షుడు చెరుకు వెంకటేశం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమార్, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ గంజి బస్వలింగం, మండల అధ్యక్షుడు గుండ్ల రాజుయాదవ్, పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాహేశ్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తండ రమేశ్, చేరాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి రెట్టింపు అవుతుందని నమ్మించి మోసం

- మహిళకు రూ.1.07లక్షల టోకరా

రామన్నపేట: పెట్టిన పెట్టుబడి రెట్టింపు అవుతుందని నమ్మించి ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన చేనేత కార్మికురాలు గుండు రమాదేవికి వెల్లంకి గ్రామంలోని ఎస్‌బీఐ బ్రాంచిలో అకౌంట్ ఉంది. 2023 సెప్టెంబర్ 23వ తేదీన రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమెకు వాట్సాప్ కాల్ చేశాడు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే కొద్దిరోజుల్లోనే రెట్టింపు ఆదాయం వస్తుందని ఆమెకు మాయమాటలు చెప్పాడు. అతని మాటలు నమ్మిన రమాదేవి రూ.3వేలను గుర్తుతెలియని వ్యక్తి చెప్పిన నంబర్‌కు ఫోన్ పే చేసింది. మరో రెండు దఫాలుగా రూ.1.04లక్షలు ఫోన్ పే చేసింది. ఆ తర్వాత ఎన్నిసార్లు అతడికి ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు తన అకౌంట్‌ను ఫ్రీజ్ చేయించి సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసింది. గురువారం రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

వడపర్తిలో వైద్యశిబిరం

భువనగిరి రూరల్: మండలంలోని వడపర్తి గ్రామంలో గురువారం మాజీ సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్, గర్భసంచి సంబంధిత సమస్యలపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దస్తగిరి, రంజిత, రమ్య, సౌమ్య, భాగ్యశ్రీ, మార్కెటింగ్ ఇన్‌చార్జులు బాబు గౌడ్, శేఖర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

గోవింద్‌తండాలో..

బొమ్మలరామారం: మండలంలోని గోవింద్ తండాలో గురువారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు మెడికేర్ యూనిట్ ద్వారా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లా జయశ్రీ ఆధ్వర్యంలో వైద్యులు వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

స్కూటీ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వలిగొండ: స్కూటీ అదుపుతప్పడంతో ఇద్దరు మహిళా టీచర్లు గాయపడ్డారు. వివరాలు.. వలిగొండ మండలం లోతుకుంటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో టీచర్లుగా బద్దుల అనూష, గంటెపాక శైలజ గురువారం విధులు ముగించుకొని స్కూటీపై ఇంటికి వెళ్తుండగా.. అరూరు గ్రామ పరిధిలోని వేదశ్రీ వెంచర్ సమీపంలో స్కూటీ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరు టీచర్లను చికిత్స నిమిత్తం స్థానికులు 108 వాహనంలో వలిగొండకు తరలించారు.

బీజేవైఎం అధికార ప్రతినిధిగా వివాకర్‌రెడ్డి

గుండాల: భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా గుండాల మండలంలోని సూనెగూడేనికి చెందిన పట్నం వివాకర్‌రెడ్డి నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు.

శ్రీరాముడికి పట్టాభిషేకం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిత్యారాధనలు నిర్వహించారు. దశ శాంతి పంచసూక్త పారాయణములతో అభిషేకములు, ఆధ్యాత్మిక రామాయణ పారాయణం, అష్టోత్తర శత నామార్చనలు జరిపించారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామికి పట్టాభిషేకం జరిపించారు. సాయంత్రం నిత్యారాధనలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.



పట్టాభిషేకం జరిపిస్తున్న అర్చకుడు

ఆర్థికసాయం అందజేత

వలిగొండ: మండలంలోని వేములకొండకు చెందిన వలమాల మారయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందాడు. బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు కేశిరెడ్డి నీరజారెడ్డి గురువారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా దాసిరెడ్డిగూడెంలో పతేపు లలిత అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి పహిల్వాన్ పురానికి చెందిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

అనంతారం గ్రామంలో..

భువనగిరి రూరల్: మండలంలోని అనంతారం గ్రామంలో దేవరాజు భారతమ్మ ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సామల వెంకటేశ్ గురువారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

కాల్వపల్లి గ్రామంలో..

రాజాపేట: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన కాకళ్ల చంద్రకళ విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి గురువారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంజ నరేష్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

కనులపండువగా రథోత్సవం

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా గురువారం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. అంతకు ముందు శాంతి హోమం, పూర్ణాహుతి జరిపించారు. కల్యాణం రోజున అన్నదానం చేసిన 1998–99బ్యాచ్ విద్యార్థులను పాలకమండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. వేడుకల్లో ఎంపీటీసీ బడుగు రమేష్, ఆలయ చైర్మన్ కట్ట దశరథరెడ్డి, తాజా మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, ధర్మకర్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న పాలక మండలి సభ్యులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

భువనగిరి రూరల్: మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలో శ్రీవేంకటేశ్వర, శ్రీరామ, శ్రీకృష్ణ దేవాలయ సముదాయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట బుచ్చిదాశ్రమ పీఠాధిపతి శంకరానంద స్వామిజీ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు రావుల నందు, వల్దాస్ గండయ్య, జిన్న మల్లేశం, జిన్న నర్సింహ, శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

ఏపీఓ లింగయ్య మృతి

భువనగిరి రూరల్: డీఆర్‌డీఏలో మండల సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న గంట లింగయ్య గురువారం మృతి చెందాడు. కొంత కాలంగా అస్వస్థతతో ఆయన బాధపడుతున్నాడు. ఆయన మృతి పట్ల డీఆర్డీఓ ఎంఏ కృష్ణన్, ఎంపీడీఓ శ్రీనివాస్, పలువురు అధికారులు సంతాపం తెలిపారు.

దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లిలో శ్రీదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు స్థాపిత దేవతాపూజ, అంకురారోపణం, శ్రీదుర్గాదేవతా మూల మంత్ర హోమం, శ్రీచండీ హోమం, శ్రీరుద్ర హోమం జరిపించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. శుక్రవారం ఉదయం దుర్గాదేవతా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.



శ్రీచండీ, రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు